

# ఆయన మీకు తెలీదు...

నాగరాజుకి పాము చెవుల్లేవు గానీ ఎక్స్‌రే కళ్లున్నాయి. ఆదిశేషుడు కూడా అలా చూళ్లేడన్న మాట! టిక్కెట్టులేని ప్రయాణికుల్ని ఇలా పసిగడతాడు. అలా పట్టుకొంటాడు. అణా పైసలతో జరీమానా వసూలు కావాల్సిందే. భల్లూకంలా వదలడు. నక్షత్రకుడిలా వేలాడతాడు. అలా నాగరాజు వసూలు చేసిన ప్రతీపైసాకీ లెక్కలుంటాయి. రశీదులుంటాయి. లొసుగులూ, రహస్యాలూ చస్తే ఉండవు.



# పొగబండి కథలు



**- ఓలేటి శ్రీనివాసభాను**

నాగరాజుకి చకచకా ప్రమోషన్లు రాలేదు గానీ ప్రశంసలు చాలా వచ్చాయి. స్క్వాడ్ టీసీగా అధికార్లు విధించిన టార్గెట్లకన్నా అధికంగానే వసూలు చేస్తాడన్న మంచి రిమార్కులు అతని సర్వీసు రికార్డులో ఉన్నాయి. రైల్వేవీక్ అవార్డనీ, జీఎమ్ అవార్డనీ, రైల్వేబోర్డు అవార్డనీ నాగరాజుకి చాలా పురస్కారాలు వచ్చాయి. అతని ఫోటో సావనీర్లలో వేశారు. డివిజనల్ ఆఫీసు బోర్డులో వేలాడదీశారు.

''అంతే... వాటిని చూసుకొని మురిసిపోవడవే! పొగిడితే చాలండీ- భుజాలు గజాలై పోతాయి. హనుమంతుడిలా ఎగురుకుంటూ పని చేస్తారు''- పుస్తెలతాడూ, నల్లపూసలూ తప్ప మరేమున్నాయి గనుక- అని ధ్వనిస్తూ, బోసి మెడ చూపిస్తుంది భార్యామణి. పేరు మణే!

రైల్వే ఆసుపత్రిలో పోసే రంగునీళ్ల వల్ల ఉబ్బసం తగ్గదంటూ- మంచం నడినెత్తిన కూర్చొని పిల్లికూతలతో సూచిస్తుంది తల్లి.

ఇద్దరు కూతుళ్లు- ఇంకా చిన్నవాళ్లు. ఇంగ్లీషు కాన్వెంటులో చేర్చాలంటుంది మణి. రైల్వే స్కూలుకే పంపిస్తున్నాడు నాగరాజు.

ఓ చెల్లెలికి పురుటి ఖర్చులూ... మరో చెల్లెలికి పెళ్లి ఖర్చులూ... జీతంలో కటింగులూ...

రైల్వేలో టీసీలంటే జేబులనిండా సంపాదిస్తారని పిల్లనిచ్చిన మామగారి ఉద్దేశం. నిజమే! నాగరాజు జేబులనిండా సంపాదిస్తాడు. కానీ ఆ మొత్తాన్ని రైల్వేకి గుప్పిళ్లతో పోస్తాడు.



''అల్లుడుగారూ... అంటున్నానని కాదు గానీ ఆలోచించుకోండి. కెరటాలు ఆగాకా స్నానం చేస్తామంటే కుదరదు. ఏం వెనకేసుకొన్నా, ఎంతవెనకేసుకొన్నా ఇదే సమయం'' అంటూ దీపం వైపు చూపిస్తూ ఇల్లు చక్కబెట్టుకోమని సైగ చేస్తారు మామగారు.

నాగరాజు అన్నీ వింటాడు. అందరివీ వింటాడు. మనిషికి మహా ఓపిక. విన్నవన్నీ ఒంట పట్టించుకుంటే తను నాగరాజెలా అవుతాడు! నల్లకోటు తగిలించుకొని రోడ్డున పడతాడు. ఆ సమయానికి ఏ బండి ఉంటే ఆ బండి పట్టుకొని, టిక్కెట్టులేని ప్రయాణికుల వేటలో పడతాడు. వెంబడిస్తూ పోతాడు. అదిగో ఆ రాత్రి పదిగంటల వేళ ఓ ప్యాసింజరు మీద అలాగే పడ్డాడు. పండగ సెలవులు. ఏ బండి చూసినా జనాలే. చలి విపరీతంగా ఉంది. నాగరాజు మఫ్లర్ చుట్టుకొని జనరల్ కంపార్టుమెంట్లు చుట్టబెడుతున్నాడు. కేసులు దొరుకుతున్నాయి. సీట్లకింద దాగున్న వాళ్లూ, దొడ్లో బోల్టులు పెట్టుకొని దాటేద్దామనుకొన్న వాళ్లూ, హాఫ్ టిక్కెట్టు చూపించి వయసు దాచేద్దామనుకొన్న వాళ్లూ ''మా బాబుకి పళ్లే రాలేదు. మాట్లాడ్డవేఁ తెలీదు'' అంటూ ఎదిగిన పిల్లలకి టిక్కెట్లు తీసుకోని తల్లులూ- ఇలా రకరకాల కేసులు. దయలేదు. దాక్షిణ్యం లేదు. ముక్కుపిండి వసూలు చేశాడు నాగరాజు.

ఆ పరంపరలో కిటికీ దగ్గర కనిపించారు ఆ ఇద్దరూ. ఒకావిడ ఒకప్పుడు పార్వతీదేవిలా ఉండేదేమోగాని, ఇప్పుడు శబరిలా ఉంది. బోసిమోడ, పండు జుట్టు, పళ్లు కూడా- ఉన్న వాటికన్నా రాలిపోయినవే ఎక్కువ. పక్కనే పదహారేళ్ల కుర్రాడు. బోడిగుండు, చెవికిపోగులు- గట్టిగా గాలి వీస్తే కిటికీలోంచి ఎగిరిపోయేలా ఉన్నాడు. ఇద్దరూ కూర్చునే నిద్రపోతున్నారు.

''బామ్మగారూ...'' నాగరాజు పిలిచాడు. పెద్దావిడ పలకలేదు. చేతిలో ఉన్న 'టికెట్ పంచ్'తో కిటికీ ఊచమీద కొట్టాడు నాగరాజు. ఆవిడ ఉలికిపడింది. కుర్రాడు మాత్రం జోగుతూనే ఉన్నాడు.

''ఏవిఁటి బాబూ రాజమహేంద్రవరం వచ్చేసిందా?'' అన్నదామె.

''చాలా దూరం ఉంది బామ్మగారూ... టిక్కెట్లు చూపించండి''

''ఒరేయ్ మూర్తీ... టిక్కెట్లట'' మనవణ్ని మోచేత్తో పొడిచింది పెద్దావిడ.

కుర్రాడు కంగారుగా లేచాడు. కళ్లు నులుముకొన్నాడు. నోట్లోంచి కారుతున్న చొంగని భుజంతో తుడుచుకొన్నాడు. పాలమారినట్లుగా దగ్గాడు.

''టిక్కెట్లేవిరా?''

''ఆఁ'' కుర్రాడు లేచినిలబడ్డాడు. ప్యాంటు జేబులు వెతికాడు. షర్టు జేబు చూసుకొన్నాడు. నిర్ఘాంతపోయాడు. పర్సులేదు. ఒక్కసారి మత్తు వదిలిపోయింది. మాట తడబడింది. పెద్దావిడ కంగారుగా అరుస్తోంది.



కుర్రాడు బిక్కచచ్చి పోయాడు. నాగరాజు చూస్తున్నాడు.

''పర్సు... పర్సు... బామ్మా...'' కుర్రాడు ఏడ్చాడు. ఏడుస్తూ మళ్లీ వెది కాడు.

''ఏమైపోయిందిరా? నాకిమ్మంటే ఇచ్చావు కాదూ?'' పెద్దావిడలో కోపం... నిస్సహాయత... ఆత్రుత.

''పోయినట్టుందే...'' కుర్రాడు బాంబు పేల్చాడు.

''పోయినట్టుందా... నిజంగానే పోయిందా?'' పెద్దావిడ కిందకి వంగింది. సీటుకింద చూసింది. మన్నుతో పొయ్యి అలికినట్లు నేలంతా తడి మింది. రేకుపెట్టె బయటకు లాగి మొత్తం అతలాకుతలం చేసింది. పర్సు లేదు.

నాగరాజు అలా చూస్తున్నాడు. అంతా గమనిస్తున్నాడు. ఇలాంటివి కుప్పలు! నిజాలకన్నా డ్రామాలే ఎక్కువ. రైల్వే అంటే లోకువ. తెగ నటిస్తారు.

''బామ్మగారూ... అయిపోయిందా? డబ్బులు కట్టండి'' అడిగాడు నాగ రాజు.

''ఏవిఁటి కట్టేది నా పిండాకూడు'' ముక్కు ఎగబీలుస్తూ ఖాళీ చేతులు తిప్పింది జటాయువులా!

''చూడండమ్మా... ఎక్కువగా మాట్లాడొద్దు. ఉంటే డబ్బులు కట్టండి. లేదంటే వచ్చే స్టేషన్‌లో దిగిపొండి. జవాన్లు వస్తారు. కేసు బుక్ చేస్తారు'' కటువుగా చెప్పాడు నాగరాజు.

బండి వేగం తగ్గింది. పెద్ద స్టేషనే- ప్లాట్‌ఫారం నిండా దీపాలు. ఇం జను వాటర్‌కాలమ్ దగ్గర ఆగింది. ఎత్తయిన ప్లాట్‌ఫారం మీంచి లోకోకళా సీలు తట్టలతో రాక్షసి బొగ్గుని ఇంజన్ వెనుక భాగంలో గుమ్మరిస్తున్నారు.

నాగరాజు- పెద్దావిణ్నీ, మనవణ్నీ లగేజీతోపాటు దింపాడు. ఆవిడ గట్టిగా ఏడుస్తోంది. అరచేత్తో నుదుటి మీద కొట్టుకొంటోంది. మధ్య మధ్యలో మనవణ్ని తిడుతోంది. నాగరాజుని గడ్డం పట్టుకొని బతిమాలు తోంది. నాగరాజు కరగలేదు. కదలమన్నాడు. ''ఊఁ.... పదండి'' అంటూ కేసు బుక్ చేసేందుకు తొందరపడుతున్నాడు. ''ఏం దారి భగవంతుడా?'' అని దిక్కులు చూస్తోంది బామ్మ. ఏదో గుర్తొచ్చినట్టు ''బామ్మా... మూట....'' అంటూ ఆదుర్దాగా కంపార్ట్‌మెంట్‌లోకి పరుగుతీశాడు మన వడు.

తప్పించుకోడానికి మరో ఎత్తు! ''ఏయ్...'' నాగరాజు వెంటపడ్డాడు.

సెకన్లలో కుర్రాడు తిరిగొచ్చాడు. అబ్బాయి చేతిలో ఓ పాత పంచె... మూట కట్టి ఉంది. పెద్దావిడ గుండె గుభేల్మంది.

''ఎంత ఘోరం జరిగిపోనురా... బతికించావ్! పర్సు పారేసుకున్నావు... ముష్టెత్తుకుంటే డబ్బులు దొరుకుతాయి. కానీ ఈ మూట? ఇది పారేసు కుంటే మీ నాన్న అస్థికల్ని ఎక్కణ్నించి తేగలం బాబూ.... గోదాట్లో కలి పేదెలా నాయినా?'' అంటూ మనవణ్ని వాటేసుకుని, చనిపోయిన కొడు కుని తలచుకొని వైనాలు వైనాలుగా ఏడ్చింది పెద్దావిడ.

నాగరాజు ఆగాడు. అడుగు వెయ్యలేక పోయాడు. కళ్ల తడిబారా యన్న సంగతే అతనికి తెలీదు.


అక్కడికక్కడ... అప్పటికప్పుడు...

కోటు జేబులోంచి ఈఎఫ్‌టీ బుక్ తీశాడు. కార్బన్లు సరిచేశాడు. రాజ మండ్రి వరకు రెండు టిక్కెట్లు- పెనాల్టీతోపాటు రాసి, గోదావరిలో అస్థికల నిమజ్జనం ఖర్చుకోసం కొంతడబ్బును కూడా టిక్కెట్టు మధ్య ఉంచి, పెద్దా విడ చేతిలో పెట్టాడు. ఇద్దరినీ రైలు ఎక్కించి, తన ప్రైవేట్ క్యాష్‌లోంచి ఆ మొత్తం ఖర్చును భరించాడు.

నాగరాజుకి నెలనెలా జీతంతో పాటు ట్రావెలింగ్ అలవెన్సు కూడా లభి స్తుంది. అందులో చాలా భాగం ఇలాగే ఖర్చయిపోతుంది. ఇంట్లో అవస రాలు వాయిదా పడుతూనే ఉంటాయి.... పట్టాల్ని నమ్ముకొన్న బతుకులు సర్దుకుపోతూనే ఉంటాయి.

నాగరాజుకి మహా ఓపిక.

❋




## పొట్ట తగ్గడానికి పంచ సూత్రాలు...

చేతులు సన్నగా వున్నా కొందరికీ నడుం, ఉదరభాగం లావుగా వుండి వికారంగా వుంటుంది. అలా బాధపడే వారి కోసం ఈ సూచనలు

**వ్యాయామం:** వ్యాయామం మంచిదే. అయితే పొట్ట తగ్గడానికి ప్రత్యే కించి కార్డియో లేదా ఏరోబిక్ ఎక్సర్‌సైజులే చేయాలి. పది నిమిషాలో, పావుగంటో చేస్తే పొట్ట సైజు తగ్గదు. కనీసం 30నుంచి 45 నిమిషాల పాటు ఈ ఎక్సర్‌సైజులు చేయాల్సి వుంటుంది. వీలుంటే రోజూ చేస్తే మంచి ఫలితాన్ని పొందవచ్చు. లేకపోతే వారానికి కనీసం మూడు సార్లన్నా ఈ ఎక్సర్‌సైజులు తప్పనిసరి.

**మంచి ఆహారం:** పొట్ట తగ్గడానికి కేవలం ఎక్సర్‌సైజులు చేస్తే సరి పోదు. ఇవి 50 శాతం మాత్రమే ఫలితాన్ని ఇస్తాయి. మిగతా 50 శాతం ఫలితాన్ని ఆహారం ఇస్తుంది. సరైన పోషకాహారం శరీరానికి శక్తినే కాదు అనవసర కొవ్వు చేరకుండా కూడా దోహదం చేస్తుంది.

**బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరి:** పొట్ట తగ్గడానికి బ్రేక్‌ఫాస్ట్ మానేయనక్కర్లేదు అంటున్నారు డైటీషియన్లు. కొవ్వు, నూనె తక్కువగా వుండే బ్రేక్‌ఫాస్ట్‌ను తీసుకోండి ఫలితం మీకే తెలుస్తుంది. సాధ్యమైనంత వరకు ఆవిరిమీద లేదా నీటిలో ఉడికించిన పదార్థాలను బ్రేక్‌ఫాస్ట్ కింద తీసుకోవడం మంచిది.

**ఉప్పును బహిష్కరించండి:** ఉప్పుకి నీటిని పీల్చుకునే గుణం వుంది. పొట్ట దగ్గర కొవ్వును తగ్గించుకోవాలనుకునే వారు ఉప్పుకి దూరంగా వుంటేనే మంచిది. సాధ్యమైనంత వరకూ ఉప్పు లేని పదార్థాలు తీసుకోవాలి.

**మందుల జోలికి పోవద్దు:** పొట్ట తగ్గిస్తామని, లావు తగ్గిస్తామంటూ చాలా కంపెనీలు మందులను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. వీటిని వాడడం వలన మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. సరైన వ్యాయామం, మంచి ఆహారం లావు తగ్గడానికి దోహదం చేస్తాయి.

❋